సంపుటి :04 | సంచిక :96 | పేజీలు :06 | www.aksharadarbar.com

అక్షర దర్బార్
Voice of the People

శుక్రవారం 15, మే 2026

వెల ₹5




# పర్యాటక మొబైల్ మ్యూజియం

## ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యాటక మొబైల్ మ్యూజియాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం ప్రారంభించారు. హనుమకొండ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మొబైల్ మ్యూజియం మూడు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు, ప్రత్యేక ప్రదర్శనలు ఈ మ్యూజియంలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పర్యాటక ప్రాంతాల విశేషాలు, సందర్శనకు సంబంధించిన సమాచారం, పర్యాటకులకు అవసరమైన బ్రోచర్లు, సమాచార పుస్తకాలను కూడా మ్యూజియంలో అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ మొబైల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి ఎ శ్రీనివాస్ కుమార్, ఎన్ఐసీ అధికారి శ్రీధర్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎండీ అయూబ్ అలీ, టీజీవో అధ్యక్షుడు జగన్ మోహన్, రాజేష్, ప్రవీణ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, సందర్శకులు తదితరులు పాల్గొన్నారు.



# ఫార్ములా ఈ రేస్ ఉచ్చు

- కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు
- జూలై 31న విచారణకు హాజరుకావాలని ఆదేశం
- చార్జిషీట్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం

02




# అభివృద్ధి బాటలో కర్రెగుట్టలు

- తడపాల కొండలను తాకిన రహదారి
- పనులను పరిశీలించిన సీఆర్‌పీఎఫ్ అదనపు డీజీ రవిదీప్ సింగ్ సహా
- గిరిజన ప్రజలకు చేరువకానున్న రవాణా, వైద్య సేవలు: ములుగు ఎస్పీ సుధీర్ రామనాథ్

ములుగు జిల్లా - ఛత్తీస్ గఢ్ సరిహద్దు ప్రాంతమైన కర్రెగుట్టల ప్రాంతంలో రహదారి అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గురువారం సిఆర్ పీఎఫ్ దక్షిణ జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిదీప్ సింగ్ సాహి, ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ తో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అత్యంత కఠినమైన భూభాగంలోనూ పనులు వేగంగా పూర్తవుతుండటంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

– అక్షరదర్బార్, ములుగు

# పార్లమెంటులో గళమెత్తుతా



- బ్యాంకర్ల సమస్యలపై వరంగల్ ఎంపీ కడియం కావ్య హామీ
- 25, 26న ఎస్‌బీఐ బంద్.. వరుసగా 5 రోజులు బ్యాంకులు క్లోజ్
- ఎంపీని కలిసి వినతిపత్రం సమర్పించిన స్టాఫ్ ఫెడరేషన్ నేతలు

03

అపరిష్కృతంగా ఉన్న బ్యాంకర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించి తగిన న్యాయం జరిగేలా చూస్తానని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య హామీ ఇచ్చారు. గురువారం ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ (హైదరాబాద్ సర్కిల్, వరంగల్ మాడ్యుల్) ప్రతినిధులు ఎంపీని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

– అక్షరదర్బార్, వరంగల్




# డీజీపీని కలిసిన సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: నూతనంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం డీజీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరుకు సంబందించిన వివరాలను డీజీపీ వరంగల్ సీపీని అడిగి తెలుసుకున్నారు.

# ఫార్ములా ఈ రేస్ ఉచ్చు

- కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు
- జూలై 31న విచారణకు హాజరుకావాలని ఆదేశం
- చార్జిషీట్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన 'ఫార్ములా ఈ రేస్' కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సహా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలకు హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టు గురువారం సమన్లు జారీ చేసింది. ఏసీబీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, ఈ కేసును విచారణకు స్వీకరిస్తూ జూలై 31న నిందితులందరూ కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో ఏసీబీ దాఖలు చేసిన చార్జిషీట్‌లో కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా (ఏ1) పేర్కొంది. ఏ2 అరవింద్ కుమార్ (సీనియర్ ఐఏఎస్ అధికారి), ఏ3 బీఎల్ఎన్ రెడ్డి (హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్), ఏ4 కిరణ్ మల్లేశ్వర్ రావు (స్పోర్ట్స్ కన్సల్టెంట్), ఏ5 ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థ

**అసలు వివాదం ఏమిటి?**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్ కోసం నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లించారన్నది ప్రధాన ఆరోపణ. కేబినెట్ అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ ఖాతాల నుంచి సుమారు రూ.55 కోట్లను (54.88 కోట్లు) విదేశీ సంస్థకు (ఎఫ్ఈవో) బదిలీ చేసినట్లు ఏసీబీ అభియోగాలు నమోదు చేసింది. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా విదేశీ కరెన్సీని బదిలీ చేయడం, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అత్యుత్సాహంతో నిధులు విడుదల చేయడంపై దర్యాప్తు సంస్థ కీలక ఆధారాలు సేకరించింది. ఈ నిధుల బదిలీకి ప్రతిఫలంగా ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పార్టీకి నిధులు అందాయనే కోణంలోనూ విచారణ జరిగింది.

**రాజకీయ ప్రకంపనలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించగా, తాజాగా గవర్నర్ నుంచి ప్రాసిక్యూషన్ అనుమతులు లభించడంతో ఏసీబీ ఈ ఏడాది మార్చిలో చార్జిషీట్ దాఖలు చేసింది. ఇప్పుడు కోర్టు ఈ చార్జిషీట్‌ను ఆమోదించి నోటీసులు జారీ చేయడంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని బీఆర్ఎస్ నేతలు కొట్టిపారేస్తుండగా, ప్రజాధనం దుర్వినియోగంపై న్యాయం జరుగుతుందని అధికార పార్టీ నేతలు అంటున్నారు.

# అభివృద్ధి బాటలో కర్రెగుట్టలు

- తడపాల కొండలను తాకిన రహదారి
- పనులను పరిశీలించిన సీఆర్‌పీఎఫ్ అదనపు డీజీ రవిదీప్ సింగ్ సహా
- గిరిజన ప్రజలకు చేరువకానున్న రవాణా, వైద్య సేవలు
- ములుగు ఎస్పీ సుధీర్ రామనాథ్



అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లా – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన కర్రెగుట్టల ప్రాంతంలో రహదారి అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గురువారం సిఆరపఎఫ్ దక్షిణ జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిదీప్ సింగ్ సాహి, ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్‌తో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అత్యంత కఠినమైన భూభాగంలోనూ పనులు వేగంగా పూర్తవుతుండటంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

**కొండల వరకు చేరిన రోడ్డు..**

మోరుమూరు నుండి ప్రారంభమైన రహదారి పామునూరు, జెల్లా, డోలి మీదుగా ప్రయాణిస్తూ తడపాల కొండల వరకు చేరుకోవడం విశేషం. దట్టమైన అటవీ ప్రాంతంలో, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సైతం పనులను వేగవంతంగా పూర్తి చేసిన సిబ్బందిని ఈ సందర్భంగా అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ రహదారుల ఏర్పాటుతో మారుమూల గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యాలతో పాటు వైద్యం, విద్య, అత్యవసర సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**భద్రతా పరమైన అంశాలపై సమీక్ష**

అనంతరం పామునూరు సిఆర్‌పీఎఫ్ క్యాంపును సందర్శించిన అధికారులు భద్రతా పరమైన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సరిహద్దు ప్రాంత భద్రత, బలగాల సమన్వయం, మావోయిస్టు వ్యతిరేక చర్యలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలుపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రేంజ్ డీఐజీ అనిల్ మింజ్, 81 బెటాలియన్ కమాండెంట్ ముఖేష్ కుమార్ సింగ్, 39 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండ్ పంచం లాల్, జాంగ్‌షేర్ పాల్గొన్నారు. వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, ఎస్సై తిరుపతి రావు రహదారి పనుల పురోగతిని అధికారులకు వివరించారు.





# నిబంధనలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు

- జిల్లా కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయ్
- ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీకి క్షేత్ర స్థాయి పరిశీలన

అక్షరదర్బార్, వరంగల్: నిబంధనలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ను జారీ చేస్తామని హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం ప్రత్యేకాధికారి గురువారం నగర పరిధిలోని దేశాయిపేట వెంకట్రామ జంక్షన్ హంటర్ రోడ్డు జేఎస్ ఎం స్కూల్ ప్రాంతం, నయీమ్ నగర్, సురేంద్రపురి ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పరిశీలించి అందజేసిన ధ్రువ పత్రాలతో పాటు కొలతలు వేసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులకు అవసరమైన ధ్రువపత్రాల సమర్పణతో పాటు సూచించిన మార్గదర్శకాలను పాటిస్తేనే అనుమతులతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను జారీ చేస్తామని తెలిపిన కలెక్టర్ అనుమతుల కోసం సమర్పించిన పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టీపీఎస్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు 'కాటమయ్య రక్షణ కిట్ల'పై శిక్షణ



అక్షర దర్బార్, చిట్యాల: తాడి చెట్లు ఎక్కే సమయంలో గీత కార్మికులకు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కాటమయ్య రక్షణ కిట్ల' వినియోగంపై గురువారం చిట్యాలలో శిక్షణ ఇచ్చారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సోషల్ వెల్ఫేర్ అధికారులు కిట్లను వాడే విధానాన్ని వివరించారు. ఈ ఆధునిక కిట్ల వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- ఆర్ఐ అరెస్ట్
- వారసత్వ భూమి పట్టా కోసం రూ. 10 వేలు లంచం తీసుకుంటూ పట్టివేత



అక్షర దర్బార్, దుగ్గొండి: దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించి, రూ. 10 వేలు లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధిర గ్రామానికి చెందిన లొల్లాటి రాజు తన తండ్రి మరణానంతరం 27 గుంటల భూమిని వారసత్వంగా మార్చుకునేందుకు దరఖాస్తు చేయగా, ఆర్ఐ రూ. 10 వేలు డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడి చేసి ఆర్ఐని అదుపులోకి తీసుకున్నారు. కార్యాలయంలోని పలు రికార్డులను సీజ్ చేసిన అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మత రాజకీయాలే బీజేపీ నైజం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ధ్వజం
- బండి భగీరథ్ తప్పు చేయకపోతే విచారణకు ఎందుకు రావడం లేదని ప్రశ్న
- ప్రజలను తప్పుదోవపట్టించడానికే తెరపైకి బీసీ కార్డని ఫైర్



అక్షరదర్బార్, హనుమకొండ: చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పవిత్రమైన దేవుళ్ల పేర్లు, మత భావోద్వేగాలను వాడుకోవడం అత్యంత దురదృష్టకరమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. చట్టం ముందు సామాన్యులకు ఒక న్యాయం, కేంద్ర మంత్రుల కుటుంబాలకు మరో న్యాయం ఉండదని నాయిని స్పష్టం చేశారు. "బండి భగీరథ్ తప్పు చేయకపోతే విచారణకు ఎందుకు హాజరు కావడం లేదు?" అని ఆయన ప్రశ్నించారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి వెనుకబడిన వర్గాల (బీసీ) కార్డును తెరపైకి తీసుకురావడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు.

**– అభివృద్ధి శూన్యం.. మత రాజకీయాలే ధ్యేయం**

గత పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిలో పూర్తిగా విఫలమైందని, అందుకే కుల, మత, ప్రాంతాల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని నాయిని ఆరోపించారు. తెలంగాణకు చెందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారని ధ్వజమెత్తారు. "తప్పు చేసి జై శ్రీరామ్ అంటే మాఫీ లభిస్తుందని బీజేపీ భావిస్తోంది. రాజకీయాల కోసం దేవుళ్లను అడ్డుపెట్టుకోవడం హిందూ ధర్మానికే అవమానం" అని ఆయన వ్యాఖ్యానించారు.

**ఆలయాల అభివృద్ధిపై సవాల్..**

తెలంగాణలోని ఆలయాలకు కేంద్రం కేటాయించిన నిధులపై ఎమ్మెల్యే నాయిని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో భద్రాచలం, బాసర, వేములవాడ పుణ్యక్షేత్రాలతో పాటు సమ్మక్క–సారలమ్మ జాతరకు భారీగా నిధులు కేటాయించామని గుర్తు చేశారు. గత పదేళ్లలో బీజేపీ–బీఆర్ఎస్ కలిసి పాలించినా ఒక్క ఆలయాన్ని కూడా సమగ్రంగా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. యాదాద్రి అభివృద్ధి పేరుతో జరిగిన భూ వ్యవహారాలు ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు.

# పార్లమెంటులో గళమెత్తుతా

- బ్యాంకర్ల సమస్యలపై వరంగల్ ఎంపీ కడియం కావ్య హామీ
- 25, 26న ఎస్‌బీఐ బంద్.. వరుసగా 5 రోజులు బ్యాంకులు క్లోజ్
- ఎంపీని కలిసి వినతిపత్రం సమర్పించిన స్టాఫ్ ఫెడరేషన్ నేతలు



అక్షరదర్బార్, వరంగల్: అపరిష్కృతంగా ఉన్న బ్యాంకర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించి తగిన న్యాయం జరిగేలా చూస్తానని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య హామీ ఇచ్చారు. గురువారం ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ (హైదరాబాద్ సర్కిల్, వరంగల్ మాడ్యుల్) ప్రతినిధులు ఎంపీని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నేతలు మాట్లాడుతూ.. బ్యాంకుల్లో సాయుధ గార్డుల నియామకం చేపట్టాలని, ఎన్‌పీఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మేనేజర్ మార్పు ఎంపిక కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే 2019లో చేరిన ఉద్యోగులకు ఇంటర్ సర్కిల్ బదిలీలను వెంటనే అమలు చేయాలని, శాశ్వత ఉద్యోగాల అవుట్‌సోర్సింగ్ విధానాన్ని నిలిపివేసి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కెరీర్ ప్రోగ్రెషన్ స్కీమ్ సమీక్షతో పాటు రిటైరీలకు సంబంధించిన పెన్షన్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**- ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలకు బ్రేక్..**

తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25, 26 తేదీల్లో దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు నేతలు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉండగా.. 25, 26 తేదీల్లో సమ్మె నిర్వహిస్తున్నామని, 27వ తేదీన బక్రీద్ సందర్భంగా సెలవు ఉందని వివరించారు. దీనివల్ల వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోతాయని, ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించి ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వారు కోరారు. బ్యాంకర్ల సమస్యలను సావదానంగా విన్న ఎంపీ కడియం కావ్య.. సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని, అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీహెచ్. సంతోష్‌కుమార్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీలు కే రాజేందర్‌సింగ్, ఎం రవీందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే కుమారస్వామి తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలే మేలు

- జంగాలపల్లిలో 'బడిబాట'



అక్షర దర్బార్, ములుగు: '99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ములుగు జిల్లా జంగాలపల్లిలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు, గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై ప్రధానోపాధ్యాయులు సామల శ్రీనివాస్ అవగాహన కల్పించారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు ఉచితంగా అందుతాయని, పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపవద్దని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ముడుతనపల్లి మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొడాటి కృష్ణమూర్తికి మాజీ ఎమ్మెల్యే మొలుగూరి నివాళి

అక్షర దర్బార్, పరకాల: హైదరాబాద్ వాస్తవ్యులు కీ.శే. కొడాటి కృష్ణమూర్తి దశదినకర్మ కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి పాల్గొని నివాళులర్పించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన, కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వెనిశెట్టి శ్యాంప్రసాద్ తదితరులు ఉన్నారు.



# ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

- ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్
- డిగ్రీ కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు
- పూర్వ విద్యార్థులకు సన్మానం.. పాల్గొన్న కౌన్సిలర్ల భర్తలు

అక్షర దర్బార్, పరకాల: 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన తల్లిదండ్రులు, విద్యార్థుల సమావేశంలో ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాశాఖకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి విద్యార్థిపై భారీగా ఖర్చు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ ఉచిత, నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్లేస్‌మెంట్లు సాధించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కాగా, ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్ల స్థానంలో వారి భర్తలు పాల్గొనడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మల్లయ్య, కౌన్సిలర్లు అల్లె దశరథం, గూడెల్లి సదన్న తదితరులు పాల్గొన్నారు.




# నిరుపేద కుటుంబానికి కౌన్సిలర్ పూర్ణచారి అండ

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 17వ వార్డుకు చెందిన వృద్ధురాలు బోళ్ల సరోజన మృతితో నిరాశ్రయులైన ఆమె కుటుంబానికి 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జెంకి పూర్ణచారి అండగా నిలిచారు. ఉండడానికి ఇల్లు కూడా లేని ఆ కుటుంబ పరిస్థితిని చూసి చలించిన ఆయన, గురువారం బాధితులను పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. దాతల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించిన ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. పూర్ణచారి చూపిన మానవత్వాన్ని స్థానికులు అభినందించారు.

